ఒకరి కలలు నెరవేరడంలో మన పాత్రా ఉందంటే... అంతకు మించిన సంతృప్తి ఏముంటుంది? అందుకే ఈ వృత్తిని ఎంతో ఇష్టంగా ఎంచుకున్నాను... అంటారు రేవతి. మనసుకి పలురకాల తర్ఫీదునిచ్చి వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాల్లో ప్రగతి సాధించేందుకు తోడ్పడే శిక్షకురాలిగా పేరొందారు తురగా రేవతి.

# మనసుకు తర్ఫీదు



మనసు కావాలంది ఒకటి, అనుకునేదొకటి, చేసేదొకటి, చెప్పేదొకటి... ఈ అంశాల మధ్య అయోమయం ముప్పుతిప్పలు పెట్టకుండా అన్నిటినీ సమన్వయపరుచుకోవడం మేం నేర్పుతాం... అంటున్న రేవతి మెటా మైండ్ మేనేజ్‌మెంట్ అనే ప్రక్రియలో కార్పొరేట్ సంస్థల ఉద్యోగులకు ప్రత్యేకశిక్షణ ఇస్తున్నారు. తమ సంస్థ అందించే వివిధ కోర్సులే కాక, ప్రత్యేకంగా ఆయా సంస్థల అవసరాలమేరకు రూపొందించిన కస్టమైజ్‌డ్ శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. సత్యం, విప్రోలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల ఉద్యోగులకు సేవలందించిన రేవతి అసలీ రంగంలోకి ఎలా వచ్చారు? ఆమె ఏం చదువుకున్నారు? ఈ ప్రశ్నలన్నీ ఆమె ముందు పెట్టింది 'వసుంధర'. ఆమె చెప్పిన విశేషాలు ఆలోచింపజేసేవే.

## తాత చూపిన బాట

గత పదేళ్లుగా వ్యక్తిత్వవికాస శిక్షకురాలిగా పేరొందిన రేవతి అసలు చదువుకున్నది, ఉద్యోగంలో చేరింది మెకానికల్ ఇంజినీరుగా. మేనేజ్‌మెంట్‌లో పీజీ చేశారు. 'ఇంజినీరు, ఉద్యోగం ఇష్టంగానే చేసినా... నెమ్మదిగా అంతకన్నా ఇష్టమైన ఈ రంగంలోకి మారిపోయాను. అందుకు ప్రధాన కారణం చిన్నప్పట్నుంచీ ఉన్న అలవాటే. చదవడం, మాట్లాడడం నాకిష్టమైన పనులు. అలాగే నేర్పడం, నేర్చుకోవడం కూడా. పుస్తకపఠనం అనే మంచి అలవాటు చిన్నప్పుడు మా తాతయ్య దగ్గర నేర్చుకున్నాను. చదివిన, విన్న... ప్రతి అంశంనుంచీ ఏదో ఒకటి నేర్చుకోవాలని చెప్పేవారాయన. అది నా మనసులో ముద్రపడిపోయింది. అందుకేనేమో. వ్యక్తిత్వ మెరుగు వికాసాలకు సంబంధించి ఎన్నో శిక్షణ కార్యక్రమాలకు హాజరయ్యాను. సర్టిఫికెట్లు పొందాను. నేర్చుకున్నది ఆచరణలో పెట్టే దిశగా స్వయంగా శిక్షణ ఇవ్వడం మొదలెట్టాను' అని చెప్పారు రేవతి. విప్రోలో నాలుగేళ్లపాటు ఈ కార్యక్రమాలు నిర్వహించారామె. గ్లోబల్ ఎకాడమీ ఆఫ్ మెటా మైండ్ మేనేజ్‌మెంట్ అనే అంతర్జాతీయ సంస్థకి ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబరుగా, దక్షిణభారత వ్యవహారాల ప్రతినిధిగా ఉన్నారు.

## కాస్త మారిస్తే...

సాధారణంగా వ్యక్తిత్వవికాసానికి సంబంధించి చాలారకాల చిట్కాలు చెప్తుంటారు. అలాకాకుండా కొన్ని పద్ధతులు, శిక్షణ ద్వారా మనస్తత్వాన్ని కొద్దిగా మార్చి అద్భుత ఫలితాలు సాధించవచ్చంటారు. సంభాషణ, నాయకత్వం తదితరాల్లో నైపుణ్యం పెంపొందించడం ఎలా? మన ఆలోచనాధోరణి ఎలా ఉండాలి? అనుభవాలను ఎలా ఉపయోగించుకోవాలి... వంటి అంశాలెన్నో నేర్పుతారు. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా అభివృద్ధిచెందడానికి ...ముఖ్యంగా మేనేజరు హోదాలో నిర్వహణాసామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఈ కార్యక్రమం తోడ్పడుతుంది. హైదరాబాద్ మార్కెటింగ్ అసోసియేషన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ విమెన్ ఎంట్రప్రెన్యూర్స్ (కోవె) తదితర సంస్థల వారికి కూడా రేవతి ప్రత్యేక తరగతులు నిర్వహించారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని, సృజనాత్మక శక్తిని పెంచేలా శిక్షణ కార్యక్రమాలున్నాయని చెప్పారు రేవతి. వినూత్నంగా ప్రయోగాలు చేస్తుంటారామె. తనదగ్గర శిక్షణ పొంది వృత్తిపరంగా లబ్ధిపొందిన వారు సంతోషంగా ఆ విషయం చెప్తోంటే, అది తనకెంతో సంతృప్తినిస్తుందని అంటారు రేవతి.

ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సంస్థల్లో, కళాశాలల్లో ఉచితంగా అతిథి ప్రసంగం ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పే రేవతి గురించి వివరాలను రేవతి ఆన్‌లైన్ డాట్‌కామ్‌లో చూడవచ్చు.